మెదక్

నమస్తే తెలంగాణ

ఆదివారం 2 జూన్ 2024

SUNDAY, JUNE 2, 2024

## రేపటి నుంచి 'పది' సప్లిమెంటరీ: డీఈవో

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 1: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఈనెల 3 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు డీఈవో రాధాకిషన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. పరీక్ష సమయంలో కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. జిల్లాలో 783 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని, ఇందుకోసం మెదక్‌లోని ప్రభుత్వ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు తమ హాల్ టికెట్లను www.bse.telanganaa.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి అర్ధగంట ముందు నుంచే అనుమతిస్తారన్నారు. 5 నిమిషాలు ఆలస్యంగా వస్తే అనుమతించబడదన్నారు. సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదన్నారు.

## మహంకాళి దేవస్థాన ఈవోగా రవికుమార్



రవికుమార్

రామాయంపేట, జూన్ 1: రామాయంపేట మహంకాళి దేవస్థానం ఈవోగా రవికుమార్‌ను దేవాదాయ, ధర్మాదాయ శాఖ నియమించినట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. శనివారం ఈవోగా కందికోట రవికుమార్ బాధ్యతలు చేపట్టారు. అనంతరం దేవస్థాన చైర్మన్ సరాఫ్ పాండురంగాచారి ఈవో రవికుమార్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శ్యామ్‌కుమార్, యాదగిరి, సత్యం, లక్ష్మి, నరేశ్, నాగరాజుచారి ఉన్నారు.

## సహకార సంఘాలకు ఎన్నికలు

**- జిల్లా సహకార సంఘాల అధికారిణి కరుణ**

మెదక్, జూన్ 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ ఆదేశాల మేరకు ఈనెల 6 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు జిల్లా సహకార సంఘాల అధికారిణి కే.కరుణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 68 ప్రాథమిక మత్స్య సహకార సంఘాలు, ప్రాథమిక గొర్రెల సహకార సంఘం, కల్లు గీత కార్మికుల సహకార సంఘానికి ఎన్నికలు ఉంటాయని పేర్కొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చిలిపిచెడ్, జూన్ 1: చిట్కుల్ గ్రామ శివారు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు శనివారం పట్టుకున్నారు. పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో మంజీరా నదిలో నుంచి వస్తున్న ట్రాక్టర్‌ను గమనించి, ఆపి పరిశీలించారు. ఇసుక ఉండడంతో పోలీస్ స్టేషన్ తరలించి కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై సుధారాణి తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ చండూర్ గ్రామానికి చెందిన రాజ్‌కుమార్‌పై, ట్రాక్టర్‌పై కేసు నమోదు చేశారు.

## అంగన్‌వాడీలో అడ్మిషన్లు

నర్సాపూర్, జూన్ 1: అంగన్‌వాడీ కేంద్రాల్లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ఐసీడీఎస్ నర్సాపూర్ ప్రాజెక్ట్ సీడీపీవో హేమ భార్గవి ప్రకటనలో తెలిపారు. నర్సాపూర్ ప్రాజెక్ట్ పరిధిలోని అన్ని గ్రామాల్లో, తండాల్లోని అంగన్వ్వాడీ కేంద్రాల్లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయన్నారు. అమ్మ ఒడి లాంటి అంగన్‌వాడి కేంద్రంలో పిల్లలను చేర్పించి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**PLOT FOR SALE**

★గజ్వేల్ టౌన్ మెయిన్ రోడ్, SBI దగ్గర 161 చ.గ. ఇంటి స్థలం అమ్మబడును. వివరాలకు సంప్ర: 8143366630 / 9989554915.
NT-334218

**WANTED**

★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-327724-All

**CHANGE OF NAME**

★I, BOULLU YADAIAH (Old Name), R/o. H.No. 4-76, Bhoompally, Akbarpet Bhoompally (Mandal), Siddipet Dist. I Changed My former Name/Surname to BOLLU YADAIAH, S/o. Bollu Balraju (New Name) for future purpose.
NT-319527

★I, KASHABOINA PRASHARAMULU (Old Name), R/o. H.No. 5-62, Bhoompally, Akbarpet Bhoompally (Mandal), Siddipet Dist. I Changed My former Name/Surname to KASABOYEENA PARSHARAMULU, S/o. Kasaboyeena Mallaiah (New Name) for future purpose.
NT-319527

★I, MOHAMMED FARDEEN, S/o. Mohammed Ahmedthullah, R/o. H.No. 2-4-93, Sajeedpura, Siddipet Urban Mandal, Siddipet Town and District. I Changed My Name from MOHAMMED FARDEEN, S/o. Mohammed Ahmed (Old Name) to MOHAMMED FARDEEN, S/o. Mohammed Ahmedthullah (New Name) for all the purpose.
NT-319527

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

# ఇబ్బందుల్లేకుండా ధాన్యం కొన్నాం

**- కలెక్టర్ రాహుల్‌రాజ్**



నిజాంపేట: ధాన్యం తేమశాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

నిజాంపేట, జూన్1: రైతులకూ ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జిల్లావ్యాప్తంగా 2 లక్షల 69 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొన్నామని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. శనివారం నిజాంపేటలోని సబ్ మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి అవుతుందన్నారు. ఎండ తీవ్రతతో నాణ్యమైన ధాన్యాన్ని సేకరించామన్నారు. నిజాంపేటలో తూకం వేసిన ధాన్యం బస్తాలను లారీలో త్వరితగతిన రైస్‌మిల్లులకు తరలించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ధాన్యం తేమ శాతాన్ని మాయిశ్చర్ యంత్రంతో పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజిరెడ్డి, ఆర్ఐ గంగాధర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ బాపురెడి, ఏపీఎం రాములు తదితరులు ఉన్నారు.

**పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి**

చేగుంట, జూన్ 1: జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. అమ్మ ఆదర్శపాఠశాల పనితీరు తనిఖీల్లో భాగంగా నార్సింగి మండలం జెప్తి శివునూర్ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు.

## బాధితులకు ఎల్‌వోసీ అందజేసిన ఎమ్మెల్యే



కౌడిపల్లి, జూన్1: కౌడిపల్లి మండలం పాంపల్లి గ్రామానికి చెందిన పాము శ్రీనివాస్‌కు ఎమ్మెల్యే సునీతారెడ్డి హైదరాబాద్‌లో తన క్యాంపు కార్యాలయంలో రూ.1.50 లక్షల ఎల్‌వోసీని శనివారం అందజేశారు. ఎమ్మెల్యేతో మాజీ సర్పంచ్ ఎల్లం, శివ్వంపేట ఆత్మ కమిటీ చైర్మన్ గొర్రె వెంకట్‌రెడ్డి, మోహన్, నరహరి, ప్రతాప్‌గౌడ్, శ్రీకాంత్ ఉన్నారు.

## బడిబాటను విజయవంతం చేయాలి

నర్సాపూర్, జూన్ 1: బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఈవో బుచ్చానాయక్ పేర్కొన్నారు. శనివారం నర్సాపూర్ మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీవో మధులత అధ్యక్షతన బడిబాటపై సమావేశం నిర్వహించారు. గ్రామాలు, పట్టణంలో 6 నుంచి 14 ఏండ్ల వయసు గల బడి బయటి పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. గ్రామాల్లోని అంగన్‌వాడీలో 0 నుంచి ఐదేండ్ల వయసు గల పిల్లల వివరాలు సేకరించాలన్నారు. మండల స్థాయిలోని తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో, ఎస్సై, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్, ఎన్‌జీవో, హెచ్‌డబ్ల్యూవో, ఐసీడీఎస్, ఎమ్ఎన్‌వో-డి, సీఆర్‌సీ అధికారులతో కమిటీని ఏర్పాటు చేశారు.

**నిజాంపేటలో..**

నిజాంపేట, జూన్ 1: బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని ఎంపీడీవో రాజిరెడ్డి పంచాయతీ కార్యదర్శులు, మహిళా సంఘాల వీవోలను సూచించారు. శనివారం నిజాంపేటలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బడిబాట కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని 19 అమ్మ ఆదర్శ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతుల కల్పన కోసం చేపట్టిన పనులు ఈనెల 5వ తేదీ లోపు పూర్తి చేయాలన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. సమావేశంలో ఎంపీవో రాజేందర్, మండల నోడల్ అధికారి యాదగిరి, ఏపీఎం రాములు ఉన్నారు.

## ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికభావం కలిగి ఉండాలి





రామాయంపేట, జూన్ 1: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికత కలిగి ఉండాలని తొగుట పీఠాధిపతి మాధవానంద సరస్వతీ పేర్కొన్నారు. శనివారం హనుమాన్ జయంతి సందర్భంగా రామాయంపేట మండలం తొనిగండ్ల గ్రామ శివారులోని అటవీప్రాంతంలో వెలిసిన భక్త హనుమాన్ మందిరంలో మాధవానంద స్వామి హనుమాన్ పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోజూ హనుమాన్ పూజ చేయాలన్నారు.

## వేంకటేశ్వరుని సేవలో ఎమ్మెల్యే రోహిత్



వెంకటేశ్వర స్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 1: జిల్లా కేంద్రంలోని హనుమంత్‌రావు నగర్ కాలనీలోని మరకత వేంకటేశ్వర ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు ఈ కార్యక్రమంలో పాల్గొని వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానంలో పాల్గొన్నారు. ఆలయం ధర్మకర్తలు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, కౌన్సిలర్లు సమియోద్దీన్, లింగం, ఆలయ కమిటీ సభ్యులు ధర్మేంద్ర, వినోద్, ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు బొజ్జ పవన్, బోస్, శివరామ కృష్ణ, కొండ శ్రీనివాస్, శంకర్‌గౌడ్ ఉన్నారు.

## వాణిజ్య బ్యాంకులకు దీటుగా డీసీసీబీ



మెదక్‌రూరల్: ఇంటింటికీ డీసీసీబీ కరపత్రం ఆవిష్కరిస్తున్న డైరెక్టర్ హన్మంత్‌రెడ్డి

మెదక్‌రూరల్, జూన్1: వాణిజ్య బ్యాంకులకు దీటుగా డీసీసీబీ సేవలందిస్తున్నదని ఆ సంస్థ డైరెక్టర్ చిలుముల హన్మంత్‌రెడ్డి అన్నారు. మెదక్‌లోని బ్యాంకులో అసిస్టెంట్ జనరల్ మేనేజర్ మహేశ్ ఆధ్వర్యంలో వినియోగదారులతో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ డీసీసీబీ కరపత్రాన్ని హన్మంత్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ సౌభాగ్య, ఫీల్డ్ ఆఫీసర్ అభినవ్, ఫరిధిపూర్ ప్యాక్స్ చైర్మన్ బ్రహ్మం, వైస్ చైర్మన్ సిద్దిరాములు, నాగాపూర్ ప్యాక్స్ చైర్మన్ శ్రీహరి, మెదక్ సీఈవో సాయికుమార్, సెక్రటరీలు పాల్గొన్నారు.

**పెద్దశంకరంపేటలో..**

పెద్దశంకరంపేట, జూన్1: డీసీసీబీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ జంగం శ్రీనివాస్, బ్యాంకు మేనేజర్ కలీముద్దీన్ అన్నారు. శనివారం పెద్దశంకరంపేట బ్యాంకులో ఇంటింటికీ డీసీసీబీ సేవలు కార్యక్రమంలో డిపాజిట్ల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వీణా సుభాశ్‌గౌడ్, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, అల్లాదుర్గం పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ చంద్రశేఖర్, భానుచందర్, తుకారాం తదితరులున్నారు.

**ఖాతా తెరవండి.. బీమా పొందండి**

నర్సాపూర్, జూన్1: ఖాతా తెరవండి రెండు లక్షల భీమా పొందండి అంటూ కరపత్రాన్ని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నర్సాపూర్ సిబ్బంది శనివారం ఆవిష్కరించారు. పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్ మాట్లాడుతూ ఈ బ్యాంకు బచ్‌పన్ భరోసా డిపాజిట్ పథకాన్ని తీసుకొచ్చిందని, పదేండ్ల లోపు వయస్సున్న చిన్నారులకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు.

**బచ్చన్ భరోసాను సద్వినియోగం చేసుకోవాలి**

పాపన్నపేట్, జూన్1: డీసీసీబీ సేవలను ప్రతిఒక్కరూ వినిమోగించుకోవాలని పాపన్నపేట్ బ్యాంకు మేనేజర్ కిషన్ తెలిపారు. పాపన్నపేట బ్యాంకులో శనివారం వినియోగదారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గురుమూర్తిగౌడ్, ఖాతాదారులు పాల్గొన్నారు.

## మోతాదుకు మించి పురుగు మందులు వాడొద్దు

**- డీఏవో గోవిందు**



కోమటిపల్లిలో అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవిందు

రామాయంపేట, జూన్1: రైతులు తమ పంట చేలల్లో మోతాదుకు మించి పురుగు మందులు వాడొద్దని, పంట దెబ్బతినే అవకాశం ఉంటుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవిందు తెలిపారు. శనివారం రామయాంపేట మున్సిపాలిటీ పరిధిలోని కోమటిపల్లికి చేరుకుని, రైతులకు సూచనలు సలహాలు ఇచ్చారు. ప్రతి రైతు మండల వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలన్నారు. పంట విత్తుకునే ముందు మోతాదులోనే పురుగు మందులు వాడాలన్నారు. రైతుల కోసం విత్తనాలు, ఎరువులు మార్కెట్లో సిద్ధంగా ఉన్నాయన్నారు. రైతులు విత్తనం దగ్గరి నుంచి పంట కోత అనంతరం మార్కెటింగ్ వరకు వివిధ అంశాల్లో విస్తృతమైన అవగాహన కలిగి ఉంటేనే పెట్టుబడి తగ్గి ఆదాయం పెరిగే అవకాశం ఉంటుందన్నారు. రైతులు పురుగు మందులు కొన్న తర్వాత కచ్చితంగా రసీదు తీసుకోవాలన్నారు. సమావేశంలో మండల వ్యవసాయ శాఖ అధికారి రాజ్‌నారాయణ, ఏఈవో రాజునాయక్ పాల్గొన్నారు.

## ఇంకుడు గుంతల పనులు పూర్తిచేయాలి

**- డీపీవో యాదయ్య**



ఇంకుడు గుంత పనులు పరశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య

కొల్చారం, జూన్ 1: మండలంలోని పోతంశెట్టిపల్లి, అప్పాజిపల్లి గ్రామాల్లో జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన పోతంశెట్టి ప్రాథమిక పాఠశాలలో చేపట్టిన ఇంకుడు గుంతల పనులను పరిశీలించారు. రెండు రోజుల్లో పనులు పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. అనంతరం పోతంశెట్టిపల్లి, అప్పాజిపల్లిలో నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలను సందర్శించి, మొక్కల పెంపకం గురించి పంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. మొక్కల పెంపకంలో జాగ్రత్తలు పాటించాలని ససూచించారు. ఆయనతో ఎంపీడీవో లక్ష్మీనర్సింలు, పంచాయతీ కార్యదర్శులు అరుంధతి, ఫణీంద్ర కృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్లు లక్ష్మి, సత్యనారాయణ ఉన్నారు.

## సమయపాలన పాటించని వైద్య సిబ్బంది



ఉదయం 11గంటలు అవుతున్నా ఆరోగ్య కేంద్రంలో దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీలు

టేక్మాల్, జూన్1: మండలంలోని గడ్డిపెద్దాపూర్ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసే సిబ్బంది సమయ పాలన పాటించక పోవడంతో రోగులు తీవ్ర కష్టాలు పడుతున్నారు. శనివారం గ్రామంలోని ఆరోగ్య కేంద్రానికి చుట్టుపక్కల గల టేక్మాల్, వట్‌పల్లి మండలాల రోగులు చికిత్స నిమిత్తం వచ్చారు. వారు వచ్చి 11 గంటలు అవుతున్నా వైద్య సిబ్బంది ఎవరూ రాలేదు. దీంతో ప్రైవేటు దవాఖాన వైపు మొగ్గు చూపుతున్నారు.

## సరిపడా ఎరువులు, విత్తనాలు అందించాలి

రామాయంపేట, జూన్ 1: రైతులకు విత్తనాలు, ఎరువులు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రైతులకు వెంటనే సరిపడా విత్తనాలు, ఎరువులు అందించే ఏర్పాట్లు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏ.మల్లేశం డిమాండ్ చేశారు. శనివారం రామాయంపేటలోని పార్టీ నాయకుల రాజకీయ శిక్షణా శిబిరాన్ని ప్రారంభించి, మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా అధికారులు రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు అంచనా వేయడంలో చిత్తశుద్ధి లేదన్నారు. జిల్లా వ్యాప్తంగా సన్న, చిన్నకారు రైతులు రెండు లక్షల మంది ఉన్నారని, అందులో 80 శాతం మంది వ్యవసాయం చేసే రైతులే జీవిస్తున్నారన్నారు. వ్యవసాయానికి అనువైన జిల్లా మెదక్ అన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షురాలు బాలమణి తదితరులు ఉన్నారు.

## చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి



చిలిపిచెడ్, జూన్ 1: చిన్నారుల్లో పోషణ లోప నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీసీ సూపర్‌వైజర్ సంతోషిమాత అన్నారు. శనివారం చిలిపిచెడ్, చండూర్, చిట్కుల్, గౌతాపూర్ గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రంలో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా 0-5 సంవత్సరాల పిల్లల బరువు, ఎత్తు, తల్లులకు గ్రోత్ మానిటరింగ్ గురించి వివరించారు. ఆకు కూరల్లో ఉండే పోషక విలువలను తల్లులకు తెలిపారు.

## యూనిఫాం కేంద్రాల సందర్శన

నర్సాపూర్, జూన్ 1: మండలంలోని మూసాపేట్ గ్రామంలో స్కూల్ యూనిఫాం సెంటర్‌ను జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాస్‌రావు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమయ్యే లోపు స్కూల్ యూనిఫాంలు సిద్ధం చేయాలని సూచించారు. ఆయన వెంట ఏపీఎం గౌరీశంకర్, సీసీలు దేవీసింగ్, ఆంజనేయులు, సభ్యులు రాణి, స్వప్న, అరుంధతి ఉన్నారు.

**యూనిఫాంలు సిద్ధం చేయాలి: ఏపీడీ**

నిజాంపేట,జూన్1: ప్రభుత్వ పాఠశాలల పునఃప్రారంభం అనంతరం విద్యార్థులకు ఇచ్చేలా యూనిఫాంలను సిద్ధం చేయాలని మెదక్ ఏపీడీ సరస్వతి అన్నారు. శనివారం నిజాంపేటలో మహిళా స్వశక్తి కుట్టుమిషన్ కేంద్రాన్ని ఏపీడీ సందర్శించారు. యూనిఫాంల కట్టింగ్, తయారీని పరిశీలించారు. పూర్తిగా తయారైన యూనిఫాంలను సురక్షితమైన ప్రదేశంలో భద్రపరచాలని, స్టిచ్చింగ్ బాగుండేలా జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఆమెతో డీపీఎం ప్రకాశ్, వెంకటేశ్, ఏపీఎం రాములు, డీఎంజీ నాగరాజు, సీసీలు ఉన్నారు.

## రెండు ఇండ్లలో రూ.3.15 లక్షలు చోరీ



బీరువా లాకర్ ధ్వంసం చేసిన దొంగలు

వెల్దుర్తి, జూన్ 1: వెల్దుర్తి పంచాయతీ శేరీల, మాసాయిపేట మండలం కొప్పులపల్లి గ్రామాల్లో చోరీ జరిగిన వేర్వేరు ఘటనల్లో రూ.3.15 లక్షల నగదు, బంగారం, వెండి ఆభరణాలు దొంగిలించినట్లు ఎస్సై నవత తెలిపారు. బాధితుల ఫిర్యాదు ప్రకారం.. కొప్పులపల్లి గ్రామానికి చెందిన పోతులగోడ శ్రీనివాస్, భార్యాపిల్లలతో కలిసి మేడ్చల్‌లోని బంధువుల ఇంటికి గురువారం వెళ్లాడు. శనివారం ఉదయం ఇంటికి తిరిగొచ్చేసరికి ఇంట్లోని బీరువా తెరిచి ఉంది. లాకర్ ధ్వంసం చేశారు. బట్టలు చిందరవందరగా పడి ఉండడంతో బీరువాలో వెతకగా ధాన్యం అమ్మి న డబ్బులు రూ.65 వేలు కనిపించలేదు. శేరీల గ్రామానికి చెందిన వడ్డె కిష్టయ్య పొలా న్ని విక్రయించగా వచ్చిన డబ్బు రూ.2.5 లక్షలు ఇంట్లో దాచి శుక్రవారం ఊరికి వెళ్లి శనివారం ఉదయం వచ్చాడు. ఇంటి తాళాలు పగులగొట్టి రూ. 2.5 లక్షల నగదు, 7గ్రాముల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లినట్లు ఎస్సై నవత తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

## వైభవంగా పద్మావతీ శ్రీనివాస కల్యాణం



పద్మావతీ శ్రీనివాస కల్యాణంలో పాల్గొన్న భక్తులు

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 1: జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వర దేవాలయ బ్రహ్మోత్సవాలు పురస్కరించుకొని శనివారం పద్మావతీ శ్రీనివాస కలాణోత్సవాన్ని నరేంద్రచారి, ఫణీంద్రచారి, రంగచారి వేదమంత్రోచ్ఛరణలతో వైభవంగా నిర్వహించారు. స్వామి వారిని పల్లకీలో ఎదుర్కోళ్లు, అనంతరం అన్నదానం చేశారు. కల్యాణంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కంచి మధుసూదన్, సభ్యులు నాగరాజు, వెంకన్న, భక్తులు పాల్గొన్నారు.

## వివాహిత ఆత్మహత్య



సరిత (ఫైల్)

రామాయంపేట, జూన్ 1: వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రామాయంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని డీ.ధర్మారం పెద్ద చెరువులో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయపోల్‌కు చెందిన మాసంపల్లి సరిత (21) తన తల్లిగారిల్లు చేగుంట మండలం కన్యారం గ్రామానికి వెళ్తున్నానని భర్త కరుణాకర్‌కు చెప్పి శుక్రవారం బస్సు ఎక్కింది. మార్గమధ్యలో డీ.ధర్మారంలో బస్సు దిగి నేరుగా చెరువులో దూకింది. విషయం తెలుసుకున్న మృతురా లి తల్లి, కుటుంబీకులు చెరువు వద్దకు చేరుకుని బోరున విలపించారు. తమ కూతురు మృతికి కరుణాకర్ పెట్టిన వరకట్న వేధింపులకే ఆత్మహత్య చేసుకున్నదని మృతురాలి బంధువులు ఆరోపించారు. విషయం తెలుసుకున్న పో లీసులు మృతదేహానికి పంచనామా చేసి, పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభు త్వ దవాఖానకు తరలించారు.

## పైపులు మీదపడి కార్మికుడి మృతి



అజయ్‌కుమార్ రౌత్ మృతదేహం

మనోహరాబాద్, జూన్1: పైపులు మీదపడి కార్మికుడు మృతి చెందిన ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం నింపాడ గ్రామానికి చెందిన అజయ్‌కుమార్ రౌత్ (46) ఐదేండ్ల క్రితం మనోహరాబాద్ మండలం కాళ్లకల్‌కు ఉపాధి నిమిత్తం వచ్చాడు. స్థానికంగా ఉన్న ఎంపీఎల్ స్టీల్ పరిశ్రమలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. శనివారం డీసీఎంలో పైపులు లోడ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు అజయ్‌కుమార్ రౌత్‌పై పైపులు పడ్డాయి. దీంతో పరిశ్రమ సిబ్బంది చికిత్స నిమిత్తం మేడ్చల్‌లోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులు అందుబాటులో లేకపోవడంతో ఫిర్యాదు రాలేదని ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

## దవాఖాన ఖర్చులకు ఆర్థికసాయం



శివ్వంపేట, జూన్ 1: మండలంలోని పిల్లుట్ల గ్రామానికి చెందిన మానెపల్లి చరణ్‌కు దవాఖాన ఖర్చులకు జడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా రూ.5వేల ఆర్థికసాయం శనివారం అందజేశారు. పిల్లుట్ల బీఆర్ఎస్ నాయకుడు చింత స్వామి రూ.5వేల ఆర్థికసాయం చేశారు. నాయిని దామోదర్‌రెడ్డి, బోను పుల్లయ్య, పిల్లి శివకుమార్, సత్యనారాయణ, పిల్లి మధు, కర్రె శ్రీకాంత్, కమ్మరి సురేశ్, కర్రె ఆంజనేయులుగౌడ్, మల్లేశ్ ఉన్నారు.

## ప్రతి గ్రామంలో ఉపాధి పనులు కొనసాగించాలి

చిలిపిచెడ్, జూన్ 1: మండలంలోని ప్రతి గ్రామంలో తప్పనిసరిగా ఉపాధి పనులు కొనసాగించాలని, హరితహారంలో నాటిన మొక్కలు కాపాడుకోవాలని గ్రామ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ప్రజలపై ఉన్నదని ఎంపీడీవో ఆనంద్ అన్నారు. శనివారం మండలంలోని జగ్గంపేట గ్రామంలో ఉపాధి హామీ, నర్సరీలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఈసీ భాగవాన్‌రెడ్డి, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

**బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం**



రామాయంపేట, జూన్ 1: రామాయంపేట మున్సిపల్‌లోని కోమటిపల్లి గ్రామానికి చెందిన కొమురమ్మ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలిసి డాక్టర్ మోహన్‌నాయక్ ఆమెకు నగరం సర్పంచ్ గేమ్‌సింగ్, సామ్య, సైదయ్యతో కలిసి రూ.10 వేల చెక్కును శనివారం అందజేశారు.

## రెండు గ్లాసుల విధానాన్ని రూపుమాపాలి



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

రామాయంపేట, జూన్1: రెండు గ్లాసుల విధానాన్ని రూపుమాపాలని తహసీల్దార్ రజనీకుమారి అన్నారు. శనివారం మండలంలోని సుతారిపల్లి గ్రామంలో పంచాయతీ కార్యాలయం వద్ద పౌరహక్కుల దినోత్సవాన్ని ప్రారభించారు. గ్రామంలో అందరూ కలిసి కట్టుగా ఉండాలన్నారు. బాల్య వివాహాలు జరుగకుండా యువత అడ్డుకోవాలన్నారు. బాల్య వివాహాలతో చిన్నారుల జీవితాలతో ఆడుకోవద్దన్నారు. బాల్య వివాహాలతో బాలికల ఆరోగ్యం చెడి పోతుందన్నారు. గ్రామంలో ఎలాంటి భేషజాలు లేకుండా అందరూ కలిసిమెలిసి ఉండాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాగి సంధ్య, ఉమామహేశ్వర్ ఉన్నారు.